# తగిన శాస్తి



రైలు ఏదో స్టేషన్‌లో ఆగింది!

తిరుపతి చేరడానికి యింకా నాలుగు గంటల ప్రయాణముంది.

నిన్న హైదరాబాదులో ట్రైను ఎక్కిన దగ్గర్నుంచీ యిప్పటివరకూ మంచి కంపెనీ యిచ్చారు మూర్తిగారు, ఆయన భార్య, కూతురు శ్రావణి.

ముఖ్యంగా... శ్రావణి! మేమిద్దరం సినిమాల గురించీ, స్పోర్ట్స్, రాజకీయాలు - ఒకటేమిటి... ఎన్నో విషయాలు మాట్లాడుకున్నాము. ఇంతకుముందు పరిచయం లేకపోయినా ఎంతో ఫ్రీగా మాట్లాడారు వారు ముగ్గురూ. తను రాత్రి భోజనం కూడా వాళ్ళతోనే కలిసి తిన్నాడు. రైల్లో తిన్నా, యింట్లో కూర్చుని కుటుంబ సభ్యులతో భోంచేసినట్లే ఉంది.

రైలు బయలుదేరబోతూండగా...

ఓ ఆరుగురు మా కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కారు. నలుగురు వచ్చి నా ప్రక్కన, మరో ఇద్దరు మూర్తిగారి ప్రక్కన కూర్చున్నారు. చేతుల్లో పుస్తకాలున్నా విద్యార్థుల్లా కనిపించడం లేదు వాళ్ళు. స్థలం చాలక యిబ్బందిగా ఉండటంతో మూర్తిగారు -

"బాబూ... ఇది రిజర్వ్డ్ కంపార్ట్‌మెంట్!" అన్నారు.

"అలాగా... మాకు తెలీదండీ!" వెటకారంగా అన్నాడొకడు.

"ఈ రైలు నీ బాబుగాడి సొమ్ము కాదురా... గవర్నమెంట్‌ది!" మరొకడన్నాడు.

నాకు ఒళ్ళు మండిపోయింది అతని మాటలకు.

"మిస్టర్! మర్యాదగా మాట్లాడండి. చిన్నా పెద్దా లేకుండా మాట్లాడతారేమిటి?" అన్నాను.

"ఒరేయ్ఁ... హీరోకు రోషమొచ్చిందిరా!"

"హీరోయిన్ ఎదురుగా ఉందిగా మరి!"

"చూడూ... ఇదే షేపులతో ఇంటికెళ్లాలనుకుంటే నోరు మూసుకుని కూర్చో!"

నాకేం చేయాలో తోచలేదు. ఆ ఆరుగురినీ ఒంటిచేత్తో మట్టి కరిపించడానికి నేనేం తెలుగు సినిమా హీరోను కాదు కదా! అందుకే మౌనంగా కూర్చున్నాను. శ్రావణికి ఎదురుగా కూర్చున్నతను సిగరెట్ తాగుతూ పొగ ఆ అమ్మాయి మీదకు వదుల్తున్నాడు.

నాకు క్షణక్షణానికీ అసహనం పెరిగిపోతోంది.

"గురూ! అయ్యా, అమ్మా అంత అందంగా లేరు- మరి, యీ అమ్మాయి ఇంత అందగా ఎలావుంది గురూ?"

"విషయం అమ్మాయి అమ్మగారి నడగరా శిష్యా!"

ఇక వినలేనట్లు లేచి దూరంగా వచ్చాను. అదృష్టవశాత్తూ టి.టి.ఇ. కనబడ్డారు. ఆయనకు విషయం చెప్పి వాళ్ళను వచ్చే స్టేషన్‌లో వేరే కంపార్ట్‌మెంట్‌కు పంపమని చెప్పాను.

"వాళ్ళు రౌడీలు నాయనా! నేను రోజూ ఇదే రూటులో వెళ్లాలి. కాబట్టి నేను చూడనట్లు వెళ్లాలి!" అంటూ వెళ్లిపోయారు.

నిరాశగా మళ్లీ వచ్చి నా సీట్లో తల వంచుకుని కూర్చున్నాను.

"ఒరేయ్ఁ... ముసలోడా! నీవు ఆ చివరికెళ్లి మీ అమ్మాయిని ఇక్కడ కూర్చోమను. మాకు కాస్త టైమ్‌పాస్ అవుతుంది."

మూర్తిగారు మాట్లాడలేదు. కళ్ళు మూసుకుని కూర్చుని వున్నారు. ముఖంలో బాధ అనుభవిస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

ఉన్నట్లుండి నా దృష్టి నా సీటు క్రిందున్న బుట్టపైన పడింది. అందులో నా భార్య రాధిక నాకిష్టమని మా పెరట్లో కాచిన జామపండ్లు, ఓ చిన్నడబ్బాలో మిరప్పొడి, ఓ చిన్న చాకు ఉంచడం గుర్తొచ్చింది. మెల్లగా బుట్టలో చెయ్యిపెట్టి మిరప్పొడిని డబ్బా నుంచి చేతిలోకి పోసుకున్నాను.

"ముసలోడా! నేను చెప్పింది వినబడలేదా?" మూర్తిగారిని కుదుపుతూ అడుగుతున్నాడు.

ఇక ఆలస్యం చేయకూడదనుకున్నాను... వెంటనే మిరప్పొడిని బలంగా, వేగంగా ఆ ఆరుగురి కళ్ళలోకి విసిరాను.

వాళ్ళు కళ్ళు నులుముకుంటూ అరుస్తూంటే ఒక్కొక్కణ్ణి పట్టుకుని ఆవేశంగా, కోపంగా బలంకొద్దీ కొట్టసాగాను.

"బాబూ... వద్దు- ఆపేయ్!" అంటున్న మూర్తిగారి మాటల్ని పట్టించుకోలేదు నేను.

ఇంతలో... కంపార్ట్‌మెంట్‌లో ఉన్న మిగతా ప్రయాణీకులు వచ్చి ఏం జరిగిందని అడిగారు.

"వీళ్ళు... వీళ్ళు ఆ అమ్మాయితో అసభ్యంగా ప్రవర్తిస్తూ, నానా కూతలూ కూస్తున్నారండీ!" ఆయాసంతో రొప్పుతూ అన్నాను.

"అలాగా! చూస్తారేం... తన్నండి గాడిదకొడుకులని!" అని అందరూ కొట్టసాగారు వాళ్ళని. తర్వాత ఆ ఆరుగురిని చేతులు వెనక్కి కట్టి పట్టుకున్నారు అందరూ.

"ఇంకో పావుగంటలో తిరుపతి వస్తోంది. ఒకరు వెళ్ళి రైల్వే పోలీసుల్ని పిలుచుకు రండి! వీళ్ళను పోలీసులకు అప్పగిస్తాం!" అన్నారు ఒక పెద్దాయన.

తిరుపతిలో వాళ్ళను రైల్వే పోలీసులకు అప్పజెప్పాక అందరికీ చేతులు జోడించి కృతజ్ఞతలు చెప్పాను.

"మనమంతా ఇలా ఐకమత్యంగా ఎదుర్కొంటే ప్రయాణాల్లో ఇలాంటి జులాయి వెధవల నుండి మన ఆడవాళ్ళను మనం కాపాడుకోవచ్చు!" అన్నాను. వారూ నాతో ఏకీభవించారు.

మూర్తిగారు నా చేతులు పట్టుకొని, "ఏడుకొండలెక్కి ఆ గోవిందుణ్ని చూస్తాననుకున్నాను కాని, ఆయనే నీ రూపంలో నాతో ప్రయాణిస్తాడనుకోలేదు. చాలా రిస్కు తీసుకున్నావు బాబూ... నీ ధైర్యం ఎంతైనా మెచ్చుకోదగ్గది!" అన్నారు.

"అది ధైర్యం కాదు మూర్తిగారూ... అసహనం, బాధ! ఎందుకు మన యువత ఇలా శాడిస్టులుగా మారుతున్నారోనన్న బాధ! ఇంతమంది వుండీ ఏమీ చేయలేకపోతున్నామన్న అసంతృప్తి! ఒక అసహాయను యిబ్బంది నుండి కాపాడాలన్న తపన! ఇవే నాతో ఆ పని చేయించింది."

శ్రావణి కూడా 'థాంక్స్' చెబుతూ "మీరు హైదరాబాద్‌లో మా ఇంటికి డిన్నర్‌కి రావాలి!" అంది.

"తప్పకుండా! నాకు అత్యంత థ్రిల్‌ని, నాపై నాకు నమ్మకాన్ని ఇచ్చిన ఈ రైలు ప్రయాణాన్ని మళ్లీ మళ్లీ గుర్తుచేసుకోవాలి కదా!" నవ్వుతూ అన్నాను.

●

**'ఆంధ్రభూమి' వారపత్రిక ... 18 అక్టోబర్' 2001**